క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర విద్యుత్తు లేన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉండవల్లి గృహాలు నుంచి పెనుమాక వరకు అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులకు సహకరించాలని పేర్కొన్నారు.

మేడికొండూరు: మండలంలోని 14 గ్రామాల్లో శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి బి.నాగరాజు కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లేన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, క్లియరెన్స్ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేడు మల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామంలో ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ పదో వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, శాంతి కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ఎస్తేరు రాణి తెలిపారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 197 మందికి షుగర్, బీపీ, థైరాయిడ్ వంటి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వచ్చేది వర్షాకాలమని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్న మేరి, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎస్ఎం అరుణ, ఎంపీహెచ్ఎస్ బాబురావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాస్పద సినిమా నిలిపివేత హర్షణీయం

తాడేపల్లిరూరల్ : ఇస్లాం పవిత్ర ఖురాన్‌కు వ్యతిరేకంగా తప్పుడు కథనాలతో రూపొందించిన, వివాదాస్పద 'హం దో హమారే బారాహ్' అనే హిందీ సినిమా ప్రదర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సుప్రీం కోర్టు ఆదేశించడం హర్షణీయమని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు షేక్ సుభాని అన్నారు. శుక్రవారం దుగ్గిరాల ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివాదాస్పద సినిమాను ప్రదర్శించకుండా ముస్లిం పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు పలు మార్గాల్లో చేసిన ఫిర్యాదులు ఫలించాయన్నారు. ఇస్లాం సాంప్రదాయం, సంస్కృతి, ముస్లింలు, ముస్లిం మహిళల నిబద్ధత, వారి వ్యక్తిగత జీవితాలను వక్రీకరిస్తూ సదరు దర్శక, నిర్మాతలు సినిమాను తీసి తమ మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరంగా తమ మతాలను, మత గ్రంథాలను గౌరవిస్తూ.. ఇతర మతాచారాలను గౌరవించాలని, ఒకరి మనోభావాలను కించపరిచేలా వ్యవహరించడం తగదన్నారు. మైనార్టీ నేతలు షేక్ రషీద్, షేక్ జాన్ సైదా పాల్గొన్నారు.

వీధి కుక్కలకు కు.ని. ఆపరేషన్లు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో పాటు యాంటీ రేబిస్ టీకాలు వేయించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి నగర ప్రజలతో పాటు జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. జాతీయ జంతు సంక్షేమ సంఘం, హరియాణా రాష్ట్ర గుర్తింపు పొందిన స్నేహ వెల్ఫేర్ సొసైటీ టెండర్ల ద్వారా గుంటూరు నగర, పంచాయతీల పరిధిలోని వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణతో పాటు యాంటీ రేబీస్ టీకాలు వేయడానికి ఒప్పందంతో పాటు అనుమతులు పొందినట్లు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ అధికారుల కమిటీ పర్యవేక్షణలో నిర్దేశిత నిబంధనల మేరకు ఏటుకూరు రోడ్డులోని ఏబీసీ సెంటర్‌లో నిపుణులైన పశువైద్యులు కుక్కలకు ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. వైద్యం, ఆహారం అందించి కోలుకున్న నాలుగు రోజుల తరువాత మళ్లీ యథాస్థానంలో విడిచి పెడతామని వివరించారు. జీఎంసీకి చెందిన నిపుణులైన సిబ్బంది వాహనంతో వచ్చినప్పుడు వీధి కుక్కలను పట్టించడంలో సహకరించాలని ఆమె నగర ప్రజల్ని కోరారు.

ఈజీ పేమెంట్



కూరగాయల దుకాణంలో క్యూఆర్ కోడ్ బోర్డు

- తగ్గుతున్న నగదు లావాదేవీలు
- ఈ–పేమెంట్స్‌కు మొగ్గుచూపుతున్న ప్రజలు
- పలు యాప్స్‌తో వేగంగా చెల్లింపులు

తాడేపల్లిరూరల్: మార్కెట్‌లో డిజిటల్ పేమెంట్స్ జోరు కొనసాగుతోంది. చిరు వ్యాపారుల చెంతకు ఈ సేవలు చేరాయి. నగదు లావాదేవీలు తగ్గుతుండగా.. ఎక్కడ చూసినా యాప్స్ ద్వారా చెల్లింపులే కనిపిస్తున్నాయి. డిజిటల్ పేమెంట్స్ చేసేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మాల్స్, పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే పేమెంట్ యాప్స్, క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు కనిపించేవి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న అపోహలు, సైబర్ మోసాలు జరుగుతున్నాయన్న ఆందోళనల మధ్య గ్రామాల్లో వీటి జాడ పెద్దగా కనిపించేది కాదు. కోవిడ్ అనంతరం పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు పెరిగాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే కనిపిస్తున్నాయి. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే, క్రెడ్ తదితర యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు చేస్తున్నారు. కిరాణ, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జిలు, విద్యుత్, గ్యాస్ బిల్లుల చెల్లింపులు చాలా వరకు ఈ–యాప్స్ ద్వారానే జరుగుతున్నాయి.

డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యం

అనేకమంది కస్టమర్లు డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగదు లావాదేవీలు చాలావరకు తగ్గిపోయాయి. వినియోగదారులు అధికంగా క్యాష్‌లెస్ లావాదేవీలు చేస్తూ ఇంటివద్ద నుంచే అన్ని రకాల సేవలు పొందుతున్నారు. దీంతో బ్యాంకులకు వచ్చే ఖాతాదారుల సంఖ్య కూడా తగ్గింది. మరోవైపు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది.

సమయం ఆదా..

డిజిటల్ పేమెంట్ ద్వారా బ్యాంకులకు వెళ్లకుండా సమయం ఆదా అవుతోందని ప్రజలు చెప్తున్నారు. చేతిలో డబ్బులు లేకున్నా బ్యాంకు ఖాతాలో డబ్బు లుంటే వస్తువులు కొనుగోలు చేయవచ్చంటున్నారు. రూపాయి నుంచి పరిమితికి లోబడి ఫోన్ పే, గూగుల్ పే తదితర యాప్స్ ద్వారా చెల్లింపులు సులభతరంగా ఉందంటున్నారు.

సులువుగా...

టీ స్టాళ్లు, చిన్న హోటళ్లు, తోపుడు బండ్లు, రోడ్ల పక్కన, ఇంటింటికీ తిరుగుతూ ఫాస్ట్ ఫుడ్, కూరగాయలు, పండ్లు వంటివి అమ్మేవారికి ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజనకరంగా మారాయి. ప్రధానంగా చిల్లర సమస్యతో వీరికి బేరాలు పోతుంటాయి. డిజిటల్ పేమెంట్స్ కారణంగా చిల్లర సమ్య తీరుతుండడంతో చిరు వ్యాపారులు కూడా వీటివైపు మొగ్గ చూపుతున్నారు. పేమెంట్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా క్యూ ఆర్ కోడ్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. గతంలో పోలిస్తే చాలా వరకు వినియోగదారులు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేసేందుకే ఆసక్తి చూపిస్తున్నారని వ్యాపారులు అంటున్నారు. కాగా వీటిని అడ్డం పెట్టుకుని కొందరు కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. వీటికి చెక్ పెట్టేందుకు క్యూ ఆర్ కోడ్ బోర్డులకు స్పీకర్ బాక్స్‌లు పెట్టారు. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారు బ్యాంక్ ఖాతాకు జమ అయ్యిందో వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో మోసాలకు అడ్డుకట్ట పడింది.

'వెద' సాగు.. బహు బాగు

- వ్యవసాయంలో ఈ విధానంతో బహుళ ప్రయోజనాలు
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



వెద సాగు కోసం ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

కొల్లిపర: ఖరీఫ్ ప్రారంభమైంది... ఇప్పటికే రైతులు పొలాల్లో ట్రాక్టర్లతో దుక్కులు పెడుతున్నారు. తెనాలి నియోజకవర్గంలోని తెనాలి, కొల్లిపర మండలాల్లో సుమారు ఈ రబీ సీజన్‌లో 27 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. తెనాలిలో 13,533 కొల్లిపరలో 12,482 ఎకరాల్లో ఖరీఫ్‌లో సాగు పనులు చేపట్టనున్నారు. ఇందులో వెద పద్ధతిలో 70 శాతం రైతులు సిద్ధం అవుతున్నారు.

సాధారణ విధానంలో నాట్లు వేసే రైతులకు.. దిగుబడి, నాణ్యమైన పంట చేతికి వచ్చినప్పటికీ పెట్టుబడి అధికం అవుతుంటుంది. అందుకే వెద పద్ధతిలో సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీని ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే అవకాశం ఉంది. ప్రధానంగా మారిన వాతావరణ పరిస్థితుల్లో తక్కువ నీటితో లాభదాయకంగా దిగుబడులు పొందవచ్చు. ప్రతికూల పరిస్థితుల్లోనూ సాగు ఆలస్యమైనప్పుడు వెద విధానం వల్ల సమయం ఆదా చేయవచ్చు.

ప్రయోజనాలు ఎన్నో...

- తొలకరి వర్షాలు సద్వినియోగం చేసుకోవచ్చు.
- నారుమడి పెంపకం, నాట్లకు అయ్యే ఖర్చు సుమారు ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు మిగులుతుంది.
- విత్తన మోతాదు 40–50 శాతం తగ్గించుకోవచ్చు.
- చెరువులు, కాలువల కింద సాగు చేసే వారు నాట్లు సకాలంలో వేసుకోవచ్చు.
- పంట నేలకు వాలిపోకుండా 10 నుంచి 15 రోజులు ముందు కోత కోసుకోవచ్చు.
- తెగులు, పురుగుల బెడద తగ్గించుకోవచ్చు.
- కోత యంత్రాలతో సులువుగా కోసుకోవచ్చు.

విత్తన రకాల ఎంపిక ఇలా...

- లోతట్టు, ముంపు ప్రాంతాలకు అనువైన రకాలు: ఎంటీయూ (1061) ఇంద్ర, ఎంటీయూ(1064) అమర , ఆర్‌జీఎల్ (2537) శ్రీకాకుళం సన్నాలు ఎత్తు ఎదిగి కాండం ధృడంగా ఉంటుంది. పడిపోని రకాలు సాగు చేసుకోవాలి.
- సాధారణ కాలువలు, చెరువుల కింద పొలాల్లో..: ఎంటీయూ 1121 (శ్రీధృతి), ఎంటీయూ 3291 (సోనామసూరి) , బీపీటీ 5204 (సాంబమసూరి), ఎంటీయూ 1210(సుజాత), ఎంటీయూ 1262 (మార్టేర్ సాంబ), ఎంటీయూ 7029 (స్వర్ణ) వేసుకోవాలి.
- కాలువ చివరి భూములు, ఆలస్యంగా విత్తే ప్రాంతాలకు అనువైన రకాలు: ఎంటీయూ 1156(తరంగణి), ఎంటీయూ 1153 (చంద్ర) , ఎన్ఎల్ఆర్ 34449 రకాలను ఎంచుకోవచ్చు.

వెద సాగులో నేల తయారీ ఇలా....

వర్షాలు పడిన వెంటనే నేలను పలుమార్లు దున్ని మెత్తగా తయారు చేయాలి. తర్వాత కలుపు సమస్య కొంత వరకూ అధిగమించవచ్చు. ఆఖరి దుక్కిలో వ్యవసాయాధికారుల సిఫారసు మేరకు భాస్వరం, పొటాష్ ఎరువులు లేదా వేప పిండి, ఆముదం పిండి , గొర్రె ఎరువు వంటి తదితర వాటిని వేసి నేలను కలియ దున్నాలి. నేలలో తేమ సరిగా లేకపోతే మొలక రాదు. తేమను చూసుకొని రొటావేటర్‌తో విత్తనాలు వేసుకోవడం మంచిది. కాలిబాటల వల్ల పైరుకు వెలుతురు, గాలి తగలడం, ఎరువులు సులువుగా వేసుకోవడం, చీడపీడల నివారణ తదితర ప్రయోజనాలు ఉన్నాయి. విత్తనాలు మొలక వచ్చిన తరువాత మొక్కలు లేని చోట వరి నారు తీసుకుని నాటవచ్చు.

అధిక దిగుబడులకు ఇలా..

- పంట పడిపోని, త్వరితగతిన కలుపు నివారణకు గల రకాలు ఎంచుకోవాలి.
- సరైన సమయంలో తగిన మోతాదులో కలుపు మందు పిచికారీ చేయాలి.
- కలుపు మందు పిచికారీ చేసే సమయంలో పొలంలో నీరు పలుచగా ఉండేటట్లు చేసుకోవాలి. తర్వాత కూడా రెండు రోజుల వరకూ నీరు నిల్వ ఉండేలా జాగ్రత్తలు అవసరం.
- విత్తిన 15 రోజులకు పిలక దశలో చిరుపొట్ట దశలో ఎరువులు వేయాలి.
- పొటాష్ ఎరువును విధిగా చిరుపొట్ట దశలో నత్రజనితోపాటు వేయాలి.
- చేనును కోత కోసే వారం రోజులు ముందు మాత్రమే ఎండగట్టాలి.

మంచి విత్తనాలు వేసుకోవాలి



రైతులు వెద పద్ధతిలో సాగు చేయడానికి ప్రస్తుతానికి అనుకూలమైన వాతావరణం ఉంది. ఇలా వరి సాగు చేసేటప్పుడు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన విధంగా విత్తనాలు చల్లుకోవాలి. సన్న రకాలు అయితే ఎకరాకు 18 కిలోలు, ముతక రకాలు 20 నుంచి 22 కేజీలు వేసుకోవాలి. ఒత్తుగా వేయడం వల్ల చేతికి వచ్చే సమయంలో పంట పడిపోయే ప్రమాదం ఉంది. ఒత్తుగా ఉండి నేలకు గాలి తగలకపోతే చీడపీడలు సోకుతాయి. కాలి బాటలు తప్పనిసరి. నత్రజని తగ్గించుకోవాలి. సీ డ్రిల్‌తో విత్తనాలు వేయడం వల్ల ప్రయోజనాలు ఉంటాయి. విత్తన శుద్ధి ప్రధానం.

– కొల్లిపర మండల వ్యవసాయాధికారి
కె.వెంకటరావు


తొలకరి పలకరింపు..సాగుకు సన్నద్ధం

- పత్తి సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు
- జలాశయాల్లో అడుగంటిన నీటి నిల్వలు
- మిర్చి సాగుకు కనబర్చని ఆసక్తి



తాడికొండ: తొలకరి పలకరించడంతో అన్నదాతలు సాగుకు సన్నద్ధమయ్యారు. పదునెక్కిన సాగు నేలలో లోతుగా దుక్కులు చేస్తున్నారు. గతేడాది అనుభవాలు ఇంకా వెంటాడుతున్న దృష్ట్యా ఈ ఏడాది అనువైన పంటను పండించేందుకు రైతులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గతేడాది జలాశయాల్లో నీరు లేక.. మిర్చి సాగు చేసిన రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఇక అతివృష్టి కారణంగా రబీలో వేసిన జొన్న, మినుము ఇతర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో నష్టాలను చవి చూడాల్సి వచ్చింది. అయితే ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించడంతో కొంత మేర ఉపశమనం పొందారు. గతేడాది పత్తి సాగు చేసిన రైతులు మాత్రమే గట్టెక్కారు. రెండేళ్లుగా వాతావరణం అనుకూలించడం, గులాబీ రంగు పురుగు బెడద అంతగా లేని కారణంగా పత్తి దిగుబడి బాగా వచ్చింది. దీంతో ప్రస్తుతం పత్తి సాగు దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మార్కెట్లో ఇబ్బడిముబ్బడిగా బీటీ పత్తి విత్తనాలు దిగడంతో ఏది నకిలీ, ఏది అసలో కనిపెట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ నకిలీలు ఆటకట్టించేందుకు వ్యవసాయాధికారులు రంగంలోకి దిగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే రైతులు సాగుకు దుక్కిదున్ని భూమిని సిద్ధం చేస్తున్నారు. మరోమారు వర్షం కురిస్తే వెంటనే పత్తి విత్తనాలు నాటే పనిలో నిమగ్నమయ్యే అవకాశం ఉంది. విత్తన డీలర్లు, స్టాకు ఇతర వివరాలతో కూడిన బోర్డులు అందుబాటులో ఉంచడంతో పాటు గ్రామాల్లో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఖరీఫ్‌లో అపరాల సాగుకు లూజు విత్తనాలు విక్రయిస్తున్నారు. దీంతో తెగుళ్లు సోకి పంట దిగుబడులపై ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు సత్వరమే స్పందించి, తగు చర్యలు తీసుకుని అండగా నిలవాలని అన్నదాతలు కోరుతున్నారు.

19 నుంచి శ్రీదత్తసాయి ప్రేమమందిరం ప్రతిష్ఠ వార్షికోత్సవాలు



ఈమని(తెనాలి) దుగ్గిరాల మండల గ్రామం ఈమనిలోని శ్రీదత్తసాయి ప్రేమమందిరం 18వ ప్రతిష్ఠ వార్షికోత్సవాలు ఈ నెల 19 నుంచి జరగనున్నాయి. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాలను తొలిరోజు ఉదయం ఆరు గంటలకు పతాకావిష్కరణతో ప్రారంభిస్తారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదాయ భజనలు చేస్తారు. 20న ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీసాయి సచ్చరిత్ర సామూహిక పారాయణం ఉంటుంది. తెనాలి మారీస్ పేటలోని శ్రీసాయి సన్నిధి నిర్వాహకులు హెచ్‌ఆర్ లక్కరాజు నిర్వహిస్తారు. 21న సాయిబాబాకు విశేష అభిషేకాలు, అనంతరం శ్రీసాయి మంత్ర జప తర్పణ హోమాలు, మధ్యాహ్నం అన్నప్రసాద పంపిణీ జరుగుతుందని తెలిపారు. అదేరోజు రాత్రి 8.30 గంటల నుంచి శ్రీమహా నందీశ్వర నాట్య మండలి గయోపాఖ్యానం నాటకంలో యుద్ధ ఘట్టం, సత్యహరిశ్చంద్రీయం నాటకంలో కాటి సీను ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. ఈమనిలోని శ్రీఅన్నపూర్ణ ఉచిత హోమియో వైద్య సేవా కేంద్రం, అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఈ వేడుకలను నిర్వహించనున్నారు.

మురుగు కాల్వల్లో పూడికను తక్షణం తొలగించాలి



నగరంపాలెం: రోజు వారీ పర్యటనలో భాగంగా శుక్రవారం 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ శ్రీనివాసరావు పేటలోని నాలుగైదు వీధుల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మురుగు కాల్వల్లో పూడికను పరిశీలించారు. సమస్యను మున్సిపల్ డీఈ రమేష్‌బాబు దృష్టికి తీసుకొచ్చారు. రానున్న వర్షకాలం దృష్ట్యా పూడికను త్వరితగతిన తొలగించాలని ఆయన్ను కోరారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు వార్డు సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు కృషి చేయాలని ఎంహెచ్ఓ మధుసూదన్ తెలియజేశారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నగరంలోని శానిటేషన్ కార్యదర్శులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల మేరకు నగరాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తి, వినియోగంపై ప్రతి శానిటేషన్ కార్యదర్శి అంచనా, అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తమ పరిధిలో ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల్లో ప్లాస్టిక్, బ్యాన్ చేసిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అంచనా చేయాలని సూచించారు. ఏ ప్రాంతంలో ఎక్కువగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం జరుగుతుందో గుర్తించి, వాటి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుతుందని తెలిపారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నారాయణ, జీఎంసీ ఎస్ఎస్‌లు ఆనంద కుమార్, రాంబాబు, ఆయూబ్‌ఖాన్, సోమ శేఖర్, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజధాని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి రామారావు

తాడేపల్లిరూరల్: రాజధాని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, రైతులకు పెండింగ్‌లో ఉన్న వార్షిక కౌలు వారి బ్యాంకు ఖాతాల్లో వెంటనే జమ చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. శుక్రవారం ఉండవల్లిలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈమని రామారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాశం రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రధాని మోదీ రాజధాని అభివృద్ధికి నిధులు ఇస్తానని వాగ్దానం చేసి విస్మరించారని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలుగుదేశం, జనసేన మిత్రపక్షంగా ఉన్న ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వాన్ని రాజధాని అభివృద్ధికి నిధులు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధులు కోరాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ మతోన్మాద అజెండాను ప్రజలు తిరస్కరించి ఆ పార్టీ మెజార్టీ స్థానాలను తగ్గించారన్నారు. దేశంలో మోదీ గ్రాఫ్ పడిపోయింది అనడానికి ఇది నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలిస్తామని మంగళగిరి ఎమ్మెల్యే లోకేష్ హామీ ఇచ్చారని, దానిని నిలబెట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ రాజధాని గ్రామాల్లో నిర్మించిన టిడ్కో గృహాల నివాసితులకు బ్యాంకు అధికారులు బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు ఇవ్వడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాజధాని డివిజన్ సీపీఎం నాయకులు ఎం.భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, సీహెచ్ సుందరరావు, ఎస్కే ఎర్రపీరు, గద్దం కృష్ణ, నాగేశ్వరరావు, షేక్ గని, ఎం. ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కాల్వల పూడికతీత పనులు

- పట్టణంలో 8 ప్రధాన కాల్వల మరమ్మతులకు చర్యలు
- భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటుకు సిద్ధమవుతున్న ప్రణాళికలు
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



కాల్వలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలోని ప్రధాన పంట, మురుగు కాల్వల పూడికతీత పనులు ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రధాన కాల్వల పూడికతీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. తర్వాత స్థానికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెనాలి పట్టణంలో 47 కిలోమీటర్ల మేర 8 ప్రధాన కాల్వలను బాగు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించినట్లు చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మొదటి విడత కింద ప్రధాన కాల్వల పూడికతీత పనులు చేపట్టామన్నారు. తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల వ్యర్థాలను ప్రధాన కాల్వల్లో ఇప్పటి వరకు వేయడం జరిగిందన్నారు. దీనివలన కాల్వల్లో చెత్త పేరుకుపోయి పారుదలకు అవరోధంగా మారినట్లు తెలిపారు. కాల్వల్లో ఉన్న వ్యర్థాలను తొలగించడంతోపాటు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో తెనాలి పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చేలా కృషి చేస్తామన్నారు. తెనాలి పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాల్వలపై ఆక్రమణలు ఎక్కువగా జరిగినట్లు గుర్తించామని తెలిపారు. వాటన్నింటిని తొలగించేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కాల్వల చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా చూస్తామన్నారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నం పిన్నారావు, దివి అనిత, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ మలికార్జునరావు, అధికారులు, జనసేన నాయకులు హరిదాసు గౌరిశంకర్, దొడ్డక ఆదినారాయణ, షేక్ జాకీర్, గుణ, బండారు రవికాంత్, సెట్టిపల్లి శ్రీనివాస్, పోలిశెట్టి సాయి, టీడీపీ నాయకులు కోగంటి శివశంకరరావు, బొల్లినేని బుజ్జి, మంగమూరి యుగంధర్, మహ్మద్ ఇస్మాయేల్ బేగ్, పసుపులేటి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గడ్డివాములు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రేపల్లె రూరల్ అగ్నిప్రమాదంలో పలువురు రైతులకు చెందిన 25 ఎకరాల గడ్డివాములు దగ్ధమైన సంఘటన పట్టణంలోని 25వ వార్డులో శుక్రవారం చోటు చేసుకుంది. అగ్నిప్రమాక అధికారి సాంబశివరావు వివరాల మేరకు.. 25వవార్డుకు చెందిన కొలుసు గోవిందు, కొలుసు శ్రీనివాసరావు, కొలుసు రామకృష్ణలకు చెందిన 18 ఎకరాల గడ్డివాము, జీ శ్రీనివాసరావుకు చెందిన 7 ఎకరాల గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. గమనించిన స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో అప్పటికే చాలావరకు గడ్డి కాలిపోయింది. మొత్తం రూ.1.80లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదన్నారు.

ఎల్‌సీఏ 625, 643 రకాల మిరప విత్తనాల విక్రయం



వెనిగండ్లలో విరగ్గాసిన మిరప పంట (ఫైల్)

పెదకాకాని: ఉద్యాన పరిశోధన స్థానం లాం ఫాంలో ఎల్‌సీఏ 625, 643 రకాల మిరప విత్తనాలు విక్రయించనున్నట్లు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.గిరిధర్ తెలిపారు. ఆయా రకాల మిరప ప్రయోజనాలను శుక్రవారం ఆయన వివరించారు. ఎల్‌సీఏ 643 రకం కాయలు బాగా పొడవుగా, లావుగా, అధిక ఘాటు, రంగు కలిగి..ఎండిన కాయలు బాడిగ రకంలా ముడతలు కలిగి ఉంటాయని తెలిపారు. ఈ రకం పచ్చి, ఎండు మిరపగా అనువైనందని పేర్కొన్నారు. అలానే ఎల్‌సీఏ 625 రకం మిరప కాయలు మధ్యస్థ పొడవుతో సన్నగా ఉండి, అధిక ఘాటుతో మంచి రంగును కలిగి ఉంటాయని వివరించారు. కోత ఆలస్యమైనా, నిల్వ ఉన్నా రెండు రెండు నెలలు రంగును కోల్పోకుండా ఉంటుందని వివరించారు. వెద పద్ధతిలో నాటుకోవటానికి మిక్కిలి అనుకూలమైన రకమన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు నేరుగా ఉద్యాన పరిశోధన స్థానం, లాం ఫాంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల లోపు విత్తనం లభ్యత ఉన్నంత వరకు పొందవచ్చని చెప్పారు. కిలో విత్తనం ధర రూ.1,200లుగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. మిరప విత్తనాలు కేవలం ఉద్యాన పరిశోధన స్థానం, లాం ఫాం నందు మాత్రమే పొందాలని, అవే పేర్లతో బయట ఎవరైనా ఈ విత్తనాలు అమ్మినట్లయితే రైతులు వాటిని కొనుగోలు చేసి, మోసపోవద్దని శాస్త్రవేత్త డాక్టర్ కె.గిరిధర్ స్పష్టం చేశారు. వివరాలకు 99898 09554, 73826 33661 నంబర్లకు సంప్రదించాలన్నారు.

- **వైభవంగా జగన్నాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం**

నగరంపాలెం: కొత్తపేటలోని జగన్నాథస్వామి దేవస్థానంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవమూర్తుల్ని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అఖండ దీపారాధన చేశారు.